# 67

# యేసు క్రీస్తు సిలువవేయబడుట

## (27:32-56)

యేసు ఇహ లోకమందు తన సంకల్పమును సాధించవలసిన సమయము, మానవాళి పాపముల కొరకై బల్యర్పణ కావలసిన సమయము రానేవచ్చింది (20:28 చూడు). అనేకుల పాపములు, చెప్పుకొంటే సమస్త మానవాళి పాపములు, క్షమింపబడునట్లు ఆయన తన రక్తమును చిందించు స్థలమునకు సైనికులు ఆయనను కొంచుబోయారు.

వారు గొల్గొతా అను స్థలమునకు చేరుకొనినప్పుడు, సైనికులు యేసును సిలువకు మేకులతో దిగగొట్టారు. ఆయనపై "యూదుల రాజు" అను నేరము మోపబడినది. ఆ దారిన వెళ్లుచుండినవారు, యూదుల నాయకులు, ఆయనకు ఇరువైపుల వ్రేలాడుచుండిన ఇద్దరు దొంగల చేత సహితము యేసు యాతనపెట్టబడినాడు. ఎట్టకేలకు యేసు తన ఆత్మను అప్పగించుకొన్నాడు.

యేసు సిలువ మీద వ్రేలాడుచు మరణావస్థలో ఉండినప్పుడు అనేక లోకాతీతమైన దృగ్విషయాలు చోటుచేసుకొన్నవి: మూడు గంటలపాటు అంధకారము అలుముకొన్నది, భూమి కంపించింది, మృతులైన పరిశుద్ధులు పునరుత్థానులయ్యారు, దేవాలయపు తెర చినిగినది.

### సిలువతో ప్రయాణము (27:32)

**32వారు వెళ్లుచుండగా కురేనీయుడైన సీమోనను ఒకడు కనబడగా ఆయన సిలువ మోయుటకు అతనిని బలవంతము చేసిరి.**

**వచనము 32.** "ఆయన తన సిలువను మోసికొని యుండగా" (యోహాను 19:17) వారు యేసును తీసికొనిపోయిరి. "సిలువ" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*stauros*), అడ్డముగా నుండు దూలమును (*patibulum*) మాత్రమే సూచింపవచ్చును, గనుక అది తరుచుగా చిత్రీకరింపబడుచున్నట్లు, నిటారుగా నుండు దూలమును (*stipes*) కలుపుకొనకపోవచ్చును.[1] యేసు ఉండిన ఇటువంటి బలహీన స్థితిలో సిలువ మొత్తమును మోయుట ఒకరికి బహు భారమైనదిగా నుండును.

శిక్ష విధింపబడినవాడు తన సిలువలోని ఒక భాగమును తానే మోయుట ఒక వాడుకయై యుండినది. "సిలువవేయబడవలసిన శిక్ష విధింపబడిన ప్రతి నేరస్థుడు తన సొంత సిలువను తన వీపుపై మోసికొని వెళ్లవలసినదేనని" గ్రీకు చరిత్రకారుడు ప్లూటార్క్ వ్రాయుచున్నాడు.[2]

స్పష్టముగా, యేసు మరియు సైనికులు యెరూషలేము పట్టణములో నుండి **వెలుపలకు వచ్చుచుండగా**, ఆయన తన సిలువ భారమును యిక మోయలేకపోయాడు. ఆయన రాత్రంతా మేల్కొని యుండెను మరియు బహుశా తినడానికిగాని, త్రాగడానికిగాని ఏమియు

ఇవ్వబడి యుండకపోవచ్చును. ఆయన భరించిన తీవ్రమైన కొరడా దెబ్బల వలన కలిగిన గాయములలో నుండి చెప్పుకోదగినంత రక్తము కారిపోయింది. సిలువ బరువు చేత యేసు దాని క్రింద కూలిపోయి యుండునని సువార్తల రచయితలలో ఏ ఒక్కరైనను వాస్తవముగా పేర్కొనకపోయినప్పటికిని, ఇంతటి భంగురమైన స్థితిలో నున్న యేసు అశక్తుడై తూలుచు కూలిపోకుండా సిలువను ఎంతో దూరము మోయలేకపోయాడని అనుకొనుట సబబే ఔతుంది.

పరిస్థితి ఇలావుండగా, సైనికులు **సీమోనను ఒకడు కనబడినప్పుడు, అతడు యేసు సిలువను మోయునట్లు అతనిని వారు బలవంతము చేసారు.** యూదులు వారి బరువులను ఒక కిలో మీటరు దూరము వరకు మోయునట్లు బలవంతము చేయుటకు రోమా సైనికులకు అధికారముండినది. "ఒకడు ఒక మైలు దూరము రమ్మని నిన్ను బలవంతము చేసిన యెడల, వానితో కూడ రెండు మైళ్లు వెళ్లుమని" యేసు చెప్పిన మాటల వెనుక గల అభ్యాసము మరియు అర్థము ఇదే (5:41పై గల వ్యాఖ్యానము చూడు).

సీమోను, ఉత్తర ఆఫ్రికా దేశంలోని ఐగుప్తుకు పశ్చిమమున నుండిన **కురేనియ** వాస్తవ్యుడై యుండెను. పాత మరియు క్రొత్త నిబంధనల మధ్య కాలములో అనేక మంది యూదులు కురేనియలో స్థిరనివాసమేర్పరచుకొన్నారు.[3] అపొస్తలుల కార్యముల గ్రంథంలో, కురేనియ వాస్తవ్యులైన యూదులు పెంతుకొస్తు నాడు సంఘము స్థాపింపబడిన సందర్భములో యెరూషలేమును సందర్శించుచుండిరని మనకు తెలియజెప్పబడుచున్నది (అపొస్తలుల కార్యములు 2:10). కురేనియ మరియు ఇతర స్థలములకు చెందిన యూదులు యెరూషలేమునకు వచ్చిన తరువాత ఒక సమాజమందిరమును నెలకొల్పుకొన్నారని కూడ అపొస్తలుల కార్యముల గ్రంథం మనకు తెలియజెప్పుచున్నది (అపొస్తలుల కార్యములు 6:9). ఈ సీమోను పస్కా పండుగను ఆచరించుటకు యెరూషలేమునకు వచ్చిన ఒక యూదా యాత్రికుడై యుండవచ్చును, లేదా అతడు తన కుటుంబముతో కూడ యెరూషలేములో స్థిరనివాసమేర్పరచుకొనినవాడై యుండవచ్చును. సీమోను, "పల్లెటూరి నుండి వచ్చి ఆ మార్గమున పోవుచుండెనని" మార్కు సువార్త రచయిత సూచించుచున్నవాడు "అలెక్సంద్రునకును రూపునకును తండ్రియై" యుండెను (మార్కు 15:21; లూకా 23:26 చూడు). చదువరులకు అర్థమైతేనేతప్ప, మార్కు వీరిని ఎందుకు పేర్కొని యుంటాడు? రోమీయులకు 16:13లో పౌలు ఒక రూపు గూర్చి చెప్పుచున్నాడు, అతడు మార్కు సువార్తీకుడు చెప్పుచున్న ఇతడే అయియుండును.

### యేసు సిలువవేయబడిన స్థలము (27:33, 34)

**33 వారు కపాలస్థలమను అర్థమిచ్చు గొల్గొతా అనబడిన చోటికి వచ్చి 34 చేదు కలిపిన ద్రాక్షారసమును ఆయనకు త్రాగనిచ్చిరి గాని ఆయన దానిని రుచి చూచి త్రాగనొల్లకపోయెను.**

**వచనము 33.** యేసు సిలువవేయబడిన స్థలము **గొల్గొతా** అని పిలువబడినది, అరమెయిక్ భాషలో **కపాలస్థలము** లేక "కపాలము" అని అర్థము (లూకా 23:33). నిరాశామయము మరియు విపత్సూచకమైన ఈ మాటకు లాటిన్ భాషలోని

*కల్వేరియ* (*Calvaria*; "Calvary") అను పదము సమానార్థము నిచ్చును.

యేసు ఏ స్థలమందు మరణించాడో మనకు ఖచ్చితంగా తెలియకపోవచ్చును. అయినను, యేసు సిలువవేయబడిన స్థలము పట్టణమునకు వెలుపట ఉండినదని లేఖనములు నిర్దిష్టముగా చెప్పుచున్నవి (హెబ్రీయులకు 13:12). ఇది యూదుల నియమము ప్రకారమైన ఏర్పాటై యుండినది (లేవీయకాండము 24:14; సంఖ్యాకాండము 15:35; 1 రాజులు 21:13; అపొస్తలుల కార్యములు 7:58 చూడు).

ఈ రోజుల్లో యెరూషలేము పట్టణమునకు వెళ్లుచుండు సందర్శకులకు, అది గొల్గొతాయై యుండవచ్చునని భావింపబడు రెండు స్థలములు చూపించబడును. *చర్చ్ ఆఫ్ ది హోలి సెపల్కర్* అను దేవాలయము లోపల నున్న బండయే గొల్గొతా అని కథోలిక్ సంఘము గుర్తించుచున్నది. ఈ నిర్మాణము మొట్టమొదట రోమా సామ్రాజ్యాధినేత కాన్‌స్టంటైన్ చేత క్రీ.శ. నాలుగవ శతాబ్దములో నిర్మింపబడినది. ఈ స్థలము క్రీస్తు కాలములో యెరూషలేము పట్టణమునకు వెలుపల ఉండియుండును. అచ్చోట నున్న అనేక సమాధులు మొదటి శతాబ్దములో నిర్మింపబడి యుండును.

ప్రొటెస్టాంటువారి ఒక సాంప్రదాయము కొండ దాపున నున్న "గోర్డన్స్ కల్వరి" అను స్థలమును సూచించుచున్నది. కొండ ప్రక్కన రాయిగా ఏర్పడిన పెద్ద బండ మానవుని కపాలమును పోలియున్నది. 1800 సంవత్సరములలో ఈ స్థలమును అనేకులు ప్రతిపాదించారు, కానీ సేనాపతియైన చార్లెస్ జార్జ్ గోర్డన్ అను పేరుగాంచిన ఒక బ్రిటీష్ సైనిక వీరుని చేత అది అత్యధిక ప్రజాదరణ పొందునంతగా ప్రఖ్యాతి చెందినది. ఏది ఏమైనా, అచ్చోట అటుతరువాత చేపట్టబడిన పురావస్తు శాస్త్రవేత్తల త్రవ్వకములు, ఈ కొండ కపాలము ఆకారములో అగుపించుటకు హేతువై యుండవచ్చును; మొదటి శతాబ్దములో ఆ స్థలము ఒక కపాలము వలె అగుపించి యుండకపోవచ్చును. దీనికి తోడుగా, తోటలోని సమాధితో పాటు సమీపమందున్న సమాధులు, క్రీ.పూ. ఎనిమిదవ లేదా ఏడవ శతాబ్దమునకు చెందియుండునని పురావస్తు శాస్త్రవేత్తలు నిర్ధారించారు.[4]

**వచనము 34.** గొల్గొతా చేరుకొనిన తరువాత, యేసును సిలువవేయవలసిన బాధ్యత ఒప్పజెప్పబడిన సైనికులు యేసుకు **చేదు కలిపిన ద్రాక్షా రసము త్రాగనిచ్చిరి**. "చేదు" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*cholē*) చేదు రుచి నిచ్చు ఒక పదార్థమును సూచించుచున్నది (కీర్తనలు 69:21). "బోళము" కలిపిన ద్రాక్షారసము త్రాగనిచ్చారని మార్కు 15:23 చెప్పుచున్నది.

రోమా సైనికులు యేసుకు ద్రాక్షా రసమును ఈ సమయంలో ఇచ్చుటలో గల హేతువేమై యుండును? (1) వారు ఆయనను యింకా ఎక్కువ ఎగతాళి చేయుచుండిరా? ఆయనకు తాజాదనమును కలుగజేయు ద్రావకము నిచ్చుటకు బదులుగా, ఆయనకు చేదు కలిపిన ద్రావకము నిచ్చుటకే నిశ్చయించుకొన్నారా? బహుశా, అలా కాకపోయియుండును. (2) వారిచ్చిన ద్రావకము, బహుశా నొప్పిని నివారించు ప్రభావముగలది, ఆయన శ్రమను మరియు యాతనను వాస్తవముగా పొడిగించునా? ఆయన శ్రమలను మరింత తీవ్రతరము చేయవలెనని వారు కోరుచుండిరా? అది కూడా కాకపోయియుండును. (3) ఆయన సంవేదన జ్ఞానేంద్రియములను మొద్దుబార జేయుటకును, బాధను భరించగలుగునట్లు తోడ్పడుటకును మానవత్వముగల హావభావాల సూచనగా ఆయనకు ఆ ద్రాక్ష రసము ఇవ్వబడినదా?

యేసును మేకులతో సిలువకు దిగగొట్టబోవుచున్నారనగా ఈ ద్రావకమును ఆయనకిచ్చారు. అసలు కారణం ఇదే అయియుండును. ఈ చివరి అర్థవివరణ టాల్మూడ్‌లో భద్రపర్చబడిన ఒక సాంప్రదాయమునకు అనుగుణ్యముగా నున్నది: "ఒకనిని సిలువవేయుటకు తీసికొని వెళ్లునప్పుడు, చిన్న పానపాత్రలో నరములను మొద్దుబారజేయునట్లు చిటికెడు గుగ్గిలము కలుపబడిన ద్రాక్షా రసము కొంచెము ఇవ్వబడినది ... యెరూషలేములోని ఘనులైన స్త్రీలు దీని దాతలై యుండి దానిని తీసికొనివచ్చుచుండిరి."[5]

చేదు కలుపబడిన ద్రాక్షా రసమును ఆయన **రుచి చూచిన తరువాత**, యేసు దానిని **త్రాగనొల్లకపోయెను**. ఆయన త్వరలో త్రాగనై యుండిన శ్రమ గిన్నె లోనిది సంపూర్తిగా రుచి చూచుటకే నిశ్చయించుకొన్నాడు గనుక ఆయన ఈ గిన్నె లోనిది త్రాగుటకు నిరాకరించాడు (26:39పై గల వ్యాఖ్యానము చూడు).

## యేసు సిలువవేయబడిన విధానము
## (27:35-37)

**35వారు ఆయనను సిలువవేసిన పిమ్మట చీట్లు వేసి ఆయన వస్త్రములు పంచుకొనిరి. 36అంతట వారక్కడ కూర్చుండి ఆయనకు కావలి యుండిరి. 37-ఇతడు యూదుల రాజైన యేసు అని ఆయనమీద మోపబడిన నేరము వ్రాసి ఆయన తలకు పైగా ఉంచిరి.**

**వచనములు 35, 36.** యేసు సిలువవేయబడుచుండిన ప్రక్రియ మూడవ జామున, లేక ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యింది (మార్కు 15:25). **వారు ఆయనను సిలువవేసిన పిమ్మట** అను పదజాలము సిలువవేయబడు ప్రక్రియ మొత్తమును సూచించదు, కానీ యేసు హస్తములు అడ్డ దూలమునకు మేకులతో దిగగొట్టబడి, దానిని పైకెత్తి, ఆ మీదట నిటారు దూలమునకు ఆయన పాదములను మేకులతో దిగగొట్టుటను సూచించుచున్నది.

ప్రాచీన ప్రపంచంలో సిలువవేయబడుట ఒకని ప్రాణము తీయుటకు రూపొందించబడిన అత్యంత భయంకరమైన విధానమై యుండినది. అది పారసీకుల చేత పాలస్తీనాలో ప్రవేశపెట్టబడినది, కానీ దానిని రోమీయులు పరిపూర్ణము గావించారు. యేసు సిలువవేయబడిన అసలు తీరు వివరములను సువార్తలు వర్ణించుట లేదు. అది అవసరంలేకుండినది, ఏలయనగా విసుగు మరియు అసహ్యము పుట్టించే ఈ దృశ్యము క్రీస్తు కాలములో జీవించియుండినవారికి అతిగా సుపరిచితమైనదై యుండినది. దీనికి మించి, చెప్పశక్యముకాని ఆధ్యాత్మిక పరిమాణము నుండి వారు పక్కదారిపట్టినవారగుదురేమో అను భయమునుబట్టి సువార్తల రచయితలు యేసు సిలువవేయబడుటకు సంబంధించిన భౌతికపరమైన కోణములను సువార్తలలో చేర్చుటకు మితభాషులై యుండియుందురు.

సిలువవేయబడవలసి యుండిన నేరస్థుని యింకా ఎక్కువ అవమానపర్చుటకు, వాని నడుముపై నున్నది తప్ప మిగిలిన వస్త్రములన్నింటిని తీసివేయుదురు. యేసు భూమికిని ఆకాశమునకును మధ్య వ్రేలాడుచుండినందు వలన, రోమీయుల సైనికులు **చీట్లువేసి ఆయన వస్త్రములు పంచుకొనిరి**. "ఆయన అంగీ కుట్టు లేక పైనుండి యావత్తు నేయబడినదై యుండినది" గనుక వారు దానిని పంచుకొనుటకు ఆశించలేదు (యోహాను 19:23, 24). వారు జూదమాడి ఆయన వస్త్రములను పంచుకొనిన వివరము కీర్తనలు 22:18లోని

ప్రవచనమును నెరవేర్చినది: "నా వస్త్రములు వారు పంచుకొనుచున్నారు, నా అంగీ కొరకు చీట్లు వేయుచున్నారు."

అటుతరువాత సైనికులు యేసు సిలువవేయబడుచుండగా పనులన్నీ సక్రమంగా జరుగునట్లును, ఎవరైనను నిందింపబడిన నేరస్థుని తప్పించుటకు ప్రయత్నించకుండునట్లును కాపలా కాయవలసిన వారి కార్యభారమును నిర్వహించుటకు కూర్చుండిపోయారు. అతని అధీనములో నున్న నేరస్థులు పూర్తిగా ప్రాణము కోల్పోవునంత వరకు పై అధికారియైన శతాధిపతి ప్రతి పనిని పర్యవేక్షించును (మార్కు 15:44, 45).

**వచనము 37.** రోమీయులు నానా విధములైన సిలువలు ఉపయోగించారు, అవి కనీసము మూడు వేర్వేరు ఆకారములలో ఉండినవి: T, †, మరియు X. ఆయన **తలకు పైగా ఆయన మీద మోపబడిన నేరము** లిఖితపూర్వకముగా గల ఒక ఫలకము ఉంచబడినదంటే ఆయన మూడవ ఆకారములో నున్న సాంప్రదాయికమైన † సిలువ మీద సిలువవేయబడినాడని చెప్పుకొనబడు అభిప్రాయమును సమర్థించుచున్నది. ఆ ఫలకము యేసు మెడకు తగిలించబడి యుండును లేదా ఆయన సిలువను మోసికొని యెరూషలేము పట్టణ వీధుల గుండా వెళ్లుచుండినప్పుడు ఆయనకు ముందర నడుచుచుండిన సైనికుని చేత పైకెత్తబడి పట్టుకొనబడి యుండును (27:31పై గల వ్యాఖ్యానము చూడు). ఇతరులు నేరములు చేయుటను నిరోధించుటయే, నేరస్థుని నేరము వ్రాయబడియున్న ఫలకమును బహిరంగముగా ప్రదర్శించుటలో గల సదుద్దేశమై యుండినది. దానిని చూచుచుండినవారికి అది భయాందోళనలు కలిగించుచు, రోమా ప్రభుత్వమునకు విరోధముగా వారు ఎటువంటి నేరమైనను చేయుటను నిరోధించినది.

మత్తయి సువార్త ప్రకారము, **ఇతడు యూదుల రాజైన యేసు** అని వ్రాయబడి యుండినది. నాలుగు సువార్తలలో వ్రాయబడి యున్న వివరమును ఒక చోట చేర్చి ఈ రాత యొక్క సంపూర్ణ వివరమును సంక్షిప్తముగా బయటికి తీయవచ్చును. అది, "ఇతడు యూదుల రాజైన, నజరేయుడగు యేసు" అయియుండినది. "నేను యూదుల రాజును అని *ఆయన చెప్పెను*" అని వ్రాయబడునట్లు పిలాతు ఆ రాతను మార్చవలెనని యూదుల అధికారులు పట్టుబట్టారు; కానీ ఆ మాటలు మార్చబడుటకు పిలాతు అంగీకరించక, "నేను వ్రాసినదేమో, వ్రాసితినని" నొక్కి వక్కాణించాడు (యోహాను 19:21, 22).

## యేసుతో కూడ సిలువవేయబడినవారు మరియు మరిన్ని అవమానములు (27:38-44)

**38మరియు కుడివైపున ఒకడును ఎడమ వైపున ఒకడును ఇద్దరు బందిపోటు దొంగలు
ఆయనతో కూడ సిలువవేయబడిరి. 39ఆ మార్గమున వెళ్లుచుండినవారు తలలూచుచు
40-దేవాలయమును పడగొట్టి మూడు దినములలో కట్టువాడా, నిన్ను నీవే రక్షించుకొనుము;
నీవు దేవుని కుమారుడవైతే సిలువమీదనుండి దిగుమని చెప్పుచు ఆయనను దూషించిరి.
41ఆలాగే శాస్త్రులును పెద్దలును ప్రధానయాజకులును కూడ ఆయనను అపహసించుచు
42వీడు ఇతరులను రక్షించెను, తన్ను తానే రక్షించుకొనలేడు; ఇశ్రాయేలు రాజుగదా,
యిప్పుడు సిలువమీదనుండి దిగినయెడల వాని నమ్ముదుము. 43వాడు దేవునియందు**

**విశ్వాసముంచెను, నేను దేవుని కుమారుడనని చెప్పెను గనుక ఆయనకిష్టుడైతే ఆయన ఇప్పుడు వానిని తప్పించునని చెప్పిరి. [44]ఆయనతో కూడ సిలువవేయబడిన బందిపోటుదొంగలును అలాగే ఆయనను నిందించిరి.**

**వచనము 38**. ఇచ్చట **ఆయనతో కూడ సిలువ వేయబడిన ఇద్దరు దొంగల** గూర్చిన వివరాలను మత్తయి తొలి సారి చేర్చుచున్నాడు. నేరము చేసిన ఈ ఇద్దరు కూడ యెరూషలేము పట్టణ వీధుల గుండా యేసుతో కలిసి లేదా వెనుక కాలినడకన తీసికొనిపోబడిరని లూకా 23:32 సూచించుచున్నది. వారందరు గొల్గొతా చేరుకొనిన తరువాత, **కుడి వైపున ఒకడును ఎడమ వైపున ఒకడును**, వారు సిలువవేయబడిరి. ఈ దృశ్యము, "అతిక్రమము చేయువారిలో ఎంచబడినవాడాయెనని" ప్రవక్తయైన యెషయా పలికిన ప్రవచనమును నెరవేర్చినది (యెషయా 53:12).

గొల్గొతాలోని ఈ దృశ్యము ఒక ప్రధాన సిలువను ప్రాముఖ్యముగా ప్రదర్శించుచుండినది–కానీ, అచ్చోట యింకా రెండు సిలువలు కూడ ఉండినవని మత్తయి చెప్పుచున్నాడు. కొన్ని విషయాల్లో, ఈ మూడు సిలువలు ఒకే విధముగా ఉండినవి. ఈ మూడు సిలువలపై వ్రేలాడుచుండినవారు బాధ, ఊపిరాడకుండుట, వేడి, కళ్ల మీదుగా కారుచుండిన చెమట, గాయములలో నుండి కారుచుండిన రసిని, అవమానములను, మరియు క్రిమికీటకాదులను భరించవలసి యుండినది. ఈ ముగ్గురు అనుభవించుచుండిన భయంకరమును, అవమానకరమునైన ఇట్టి మరణమును వింతగా చూచుచు ఆ దారిన వెళ్లుచుండినవారి తీక్షణమైన చూపులను వారు సహించవలసి యుండినది. అపారమైన తారతమ్యములు కూడ ఉండినవి. ఒక సిలువ, తిరుగుబాటుతనమును ప్రదర్శించుచుండినది, దానిపై మారుమనస్సు నొందని దొంగ వ్రేలాడుచుండెను (లూకా 23:39). రెండవది, మారుమనస్సును ప్రదర్శించుచుండినది, దానిపై పశ్చాత్తాపము నొందిన దొంగ వ్రేలాడుచుండెను (లూకా 23:40, 41). మూడవది, విమోచనను ప్రదర్శించుచుండినది, దానిపై యేసు క్రీస్తు మరణించాడు.

క్రీస్తుతో కూడ మరణించుచుండిన దొంగలు మామూలు దొంగలు కాదు. "దొంగలు" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*lēistai*), వారి కోరికలను తీర్చుకొనుటకు బలాత్కారము మరియు దౌర్జన్యమునకు పాల్పడకుండుటకైనను వెనుకంజ వేయనివారిని సూచించుచున్నది. వాస్తవమునకు, ఈ పదము కొన్ని పర్యాయములు విప్లవకారులను సూచించును. బరబ్బ, బందిపోటు దొంగ అని పేర్కొనబడుచున్నాడు (*lēistēs*; యోహాను 18:40); అతడు ప్రభుత్వానికి బాహాటంగా ప్రతిబంధకము కల్పించుచు హత్య చేసిన సందర్భములో ఖైదుచేయబడినాడు (మార్కు 15:7). యేసుకు ఇరువైపుల సిలువవేయబడినవారు బరబ్బ నాయకత్వములో నడుచుచుండిన దొంగల ముఠాలో సభ్యులై యుందురు, ఏలయనగా వారు కూడ బరబ్బ ఖైదు చేయబడిన సమయంలోనే చెరసాలలో వేయబడిరి (26:55పై గల వ్యాఖ్యానము చూడు).

ఈ ఇద్దరు దొంగల పేర్లు క్రొత్త నిబంధనలో పేర్కొనబడలేదు. శతాబ్దములు గడిచిన కొలది, వాస్తవముగా కాకపోయినా కల్పనా కథ రూపంలోనైనా, బహువిధములైన పేర్లు వారికి ఆరోపింపబడినవి, డిస్మా మరియు గెస్టా, జోతామ్ మరియు కామ్నా, జోతాస్

మరియు మగ్గ్రా, తీతు మరియు దుమాఖు మొదలగునవి.[6]

**వచనము 39. ఆ మార్గమున వెళ్లుచుండినవారు** యేసుపై **దూషణ పలుకులు** పలికిన మొదటి గుంపై యుండిరి. యేసు సిలువవేయబడిన చోటు పట్టణమునకు వెలుపలనే ఉండినందువలన, యూదులలో అనేకులు యేసు సిలువవేయబడుటను కళ్లారా చూసారు (యోహాను 19:20). ఆ మార్గమున వెళ్లుచుండినవారిలో కొందరు పస్కా పండుగకు యెరూషలేము పట్టణమునకు వచ్చిన యాత్రికులై యుందురు.

ఆ మార్గమున వెళ్లుచుండినవారు యేసును చూచుచు **వారి తలలూచుచుండిరి**. యేసు యెడల వారు పలుకుచుండిన పరిహాసపు వెక్కిరింతలతో కూడిన పలుకులు కీర్తనలు 22:6, 7లోని ప్రవచన వాక్కులను నెరవేర్చినవి:

> నేను నరుడను కాను నేను పురుగును
> నరులచేత నిందింపబడినవాడను, ప్రజలచేత తృణీకరింపబడినవాడను.
> నన్ను చూచువారందరు పెదవులువిరిచి తల
> ఆడించుచు, నన్ను అపహసించుచున్నారు.

**వచనము 40. –దేవాలయమును పడగొట్టి మూడు దినములలో కట్టువాడా, నిన్ను నీవే రక్షించుకొనుము; నీవు దేవుని కుమారుడవైతే సిలువ మీద నుండి దిగుమని** అచ్చట చేరిన జనం పలుకుచుండిరి. వారి నోటి మాటలు అంతకు పూర్వము సంభవించిన సంఘటనలను ప్రస్తావించినవి. మొదటిగా, యేసు సాధికారంతో ఉద్ఘాటించి పలికిన విషయమును గుర్తుచేసుకొన్నారు. ఆయన తొలి సారి దేవాలయమును శుద్ధి చేసిన సమయంలో, "ఈ దేవాలయమును పడగొట్టుడి, మూడు దినములలో దాని లేపుదునని" ఆయన పలికాడు (యోహాను 2:19). ఆయన చేసిన ఘోషణను వక్రీకరించి దానినే యూదులు దాదాపు మూడు సంవత్సరముల కాలము వారి మనస్సుల్లో ఉంచుకొన్నారు. యూదుల చేత యేసుకు తీర్పు తీర్చబడినప్పుడు, ఆయన మాటల గూర్చి వారు తికమకపడి అపార్థం చేసుకొన్న ఆలోచనలను పేర్కొనుచు అబద్ధ సాక్షులు ఆయనకు విరోధముగా మాటలాడారు (26:60, 61పై గల వ్యాఖ్యానము చూడు). స్పష్టంగా, యూదుల నాయకులు ఈ అసత్య ఆరోపణను అంతటా వ్యాపింపజేయుచు, ప్రజలను యేసుకు విరోధముగా పురికొల్పారు. రెండవదిగా, ("నీవు దేవుని కుమారుడవైనట్లయితే ..." అను) ఆయనే రుజువు చేసుకొనునట్లు ఎదురైన సవాలు, అరణ్యములో ఆయన సాతాను నుండి ఎదుర్కొనిన శోధనలను గుర్తుచేయుచుండిన విషయమై యుండినది (4:3, 6పై గల వ్యాఖ్యానము చూడు). ఈ సందర్భములో, ఒక గొప్ప శక్తిని ప్రదర్శించుట ద్వారా ఆయనకును దేవునికిని గల సంబంధమును రుజువుచేసికొనవలెనని ఆ మార్గమున వెళ్లుచుండినవారు యేసు యెడల ఎత్తిపొడుపు మాటలు పలుకుచుండిరి. వ్యంగ్యంగా, ఆయన సిలువపై ఉన్నాడను వాస్తవమే ఆయన దేవుని కుమారుడై యున్నాడని వెల్లడిచేసినది. యేసు తన తండ్రి చిత్తమునకు విధేయుడైన వివరమును ఆయన ఈ విధంగా బయలుపర్చాడు (హెబ్రీయులకు 5:7–9).

**వచనము 41. శాస్త్రులును పెద్దలును ప్రధానయాజకులును** ఆయనను అవమానించిన రెండవ గుంపులో ఉండిరి. యేసు యెరూషలేము నాయకుల చేత పూర్తిగా తృణీకరింపబడినాడని ఈ జాబితా రూఢిపర్చుచున్నది. యేసు సిలువవేయబడిన చోట ఈ

శిష్టజనముండుట, మతసంబంధమైన వ్యవస్థ యేసు యెడల ఎంత గంభీరమైన ఆగ్రహము మరియు వైరభావము కలిగియుండినదో వెల్లడియగుచున్నది.[7]

**అపహసించుట** అని అనువదింపబడిన గ్రీకు పదము (*empaizō* నుండి), చిన్న పిల్లలు ఒకరినొకరు గేలిచేసుకొను అవగాహనను కలిగించుచున్నది.[8] పరిహాసముగా, పెద్దమనుష్యులై యుండిన వీరు, ఆధ్యాత్మికముగా ఎంతో పరిపక్వత చెందినవారై యుండవలసిన ఈ యూదులు, అక్రమమైన అల్లరి పిల్లలుగా ప్రవర్తించుచుండిరి! యేసుకు రాత్రి వేళ తీర్పు తీర్చుచుండిన సమయంలో, ఆయన మీద ఉమ్మివేయుచు, ఆయనను పిడిగుద్దులు గుద్దుచు, చెంపపై కొట్టుచు, ఆయన యెడల కూడ నేరము చేసినవారితో ప్రవర్తించు రీతినే ప్రవర్తించారు (26:67, 68).

యేసు మరణమునకు అత్యంత బాధ్యులై యుండినవారు వీరే, ఏలయనగా ఇస్కరియోతు యూదా ఆయనను వారికి పట్టించవలెనని వానికి ముప్పది వెండి నాణెములు ఇచ్చినది వీరే (26:14–16). ఆయనకు విరోధముగా నేరము మోపుట మాత్రమేగాక ఆయన చంపబడవలెనని పాటుపడుచు ప్రకటనలు చేసినది వీరే (26:57–68; యోహాను 19:7). పిలాతు ఆయనను సిలువవేయ వలసినదని పట్టుబట్టినది వీరే మరియు యేసు సిలువవేయబడవలెనని వారు కేకలు వేయునట్లు యూదుల జనసమూహమును రెచ్చగొట్టినది వీరే (27:20–25). మానవ దృష్టికోణంలో చూచినట్లయితే, వారినిబట్టియే యేసు సిలువవేయబడినాడు, లేదంటే ఆయన సిలువవేయబడెడివాడు కాదు. అట్లయినప్పటికిని, యేసు వారి దుష్ట కుయుక్తులకు లొంగిపోయాడు, సిలువను ఒక బలిపీఠముగా మార్చుకొన్నాడు, దేవుని నిత్య ప్రణాళిక ప్రకారము ఆయన సిలువవేయబడుట అమలగునట్లు అంకితము చేసికొన్నాడు (అపొస్తలుల కార్యములు 2:23, 24 చూడు).

**వచనము 42. వీడు ఇతరులను రక్షించెను, తన్నుతానే రక్షించుకొనలేడని;** పలుకుచు, యూదుల నాయకులు యేసును అపహసించారు. ఆయన తన పరిచర్య కాలములో చేసిన అద్భుతకార్యములను వారు హేళన చేయుచుండిరి. శక్తిమంతమైన ఈ కార్యములు దేవుని లోకములో అన్యాయమునకు గురియగుచు అగచాట్లపాలగుచుండినవారి యెడల ఆయన కలిగియుండిన కనికరమును బయలుపర్చినవి. దీనిని మించి, ఆయన దేవుని కుమారుడైన క్రీస్తై యున్నాడని నిరూపించుచుండిన శక్తిమంతమైన నిదర్శనములై యుండినవి (11:2–6; యోహాను 20:30, 31).

ఆయన సిలువమీద వ్రేలాడుచుండినప్పటికిని యేసు నిస్సందేహముగా యింకా అద్భుతకరమైన శక్తి కలిగియుండినాడు గనుక ఆయన సిలువను ఎదిరించియుండినట్లయితే తన ప్రాణమును తాను దక్కించుకొనుటకు ఆయన దానిని ఉపయోగించుకొని యుండెడివాడే. తండ్రియైన దేవుని చిత్తమును పాటించుటకే, శ్రమ మరియు మరణమను గిన్నె లోనిది త్రాగుటకు ఆయన తనను తాను అంతగా తగ్గించుకొన్నాడు. ఔను, ఆయన సకల మానవులను వారి సమస్త పాపముల నుండి రక్షించవలసి యుండెను గనుకనే, ఆయన తనను తాను రక్షించుకొనలేదు. యేసు నిశ్చేష్టతను యూదుల నాయకులు అశక్తతగా అపార్థం చేసికొన్నారు. పరుషోక్తికరముగా, యేసు ఇశ్రాయేలీయుల రాజని క్రూరులైనవారు ఒప్పుకొన్నారు. ఆయనకు తీర్పు తీర్చబడుచుండిన సమయంలో, ప్రధాన యాజకుడైన కయప, ఆయన “దేవుని కుమారుడైన క్రీస్తై యున్నాడేమోనని” యేసును

ప్రశ్నించాడు (26:63). అటుతరువాత, ఆయన "యూదుల రాజై యున్నాడేమోనని" పిలాతు యేసునడిగాడు (27:11). ఈ రెండు సందర్భములలోను యేసు నిశ్చయాత్మకమైన సమాధానము నిచ్చాడు (26:64; 27:11). రాజత్వము గూర్చి యేసు నొక్కివక్కాణించిన సంగతి సైనికుడు యేసును ఎగతాళి చేయుచు పలికిన మాటల్లోను (27:28-31) మరియు యేసు తలకు పైగా వ్రాయబడి యుండిన రాతలోను: "ఇతడు యూదుల రాజైన యేసు" (27:37) ప్రతిబింబించుచున్నది.

"యిప్పుడు సిలువ మీద నుండి దిగినయెడల, వాని నమ్ముదుము" అంటూ యూదుల నాయకులు వారి హేళన పలుకులు కొనసాగించారు. వాస్తవముగా వారు యేసును "అపహసించారు" (లూకా 23:35). ఆయన ఎవరై యుండెనో వారి యెదుట రుజువుపర్చుకొనుటకు చాలినంత అధికారము మరియు శక్తిని యేసు అదివరికే ప్రదర్శించాడు, అట్లయినను వారు ఆయనను తృణీకరించారు. ఆయన సిలువ మీద నుండి దిగినట్లయితే, ఆయన యెడల వారు చేసినది శుద్ధ తప్పని అంగీకరించుటకు బదులుగా వారు దానికి మరొక విశేషమైన వివరమునిచ్చెడివారే. ఆయన సిలువపై మరణించుట ద్వారా యేసు, దేవుని నిత్య సంకల్పమును నెరవేర్చుట మాత్రమే కాదు, కానీ ఆయన ఉపదేశించిన సుబోధల గూర్చిన మాదిరిని కూడ లోకమునకు చూపించాడు (10:38, 39; 16:24-26పై గల వ్యాఖ్యానము చూడు).

**వచనము 43.** యింకా, **వాడు దేవుని యందు విశ్వాసముంచెను, నేను దేవుని కుమారుడనని చెప్పెను గనుక ఆయనకిష్టుడైతే ఆయన ఇప్పుడు వానిని తప్పించునని** కూడ పలికారు. వారు ఆయనపై మోపిన నింద శుద్ధ దేవదూషణయై యుండినది. వారు పలికిన పలుకులు కీర్తనలు 22:8లో గల ప్రవచన వాక్కులకు అనుగుణ్యముగా నున్నవి: "అతడు యెహోవా యందు నమ్మకముంచుచున్నాడు; వాడు ఆయనకు ఇష్టుడు గనుక, దేవుడే వానిని తప్పించునేమో" (NIV).[9] ఆయన దేవుని కుమారుడై యున్నాడను ఉద్ఘాటనపై యూదుల నాయకులు నీలాపనిందలు వేయుచుండిరి (26:63, 64). దేవుడు ఆయన గూర్చి సంతుష్టిచెందినట్లయితే, ఆయన తప్పక యేసును కాపాడునని వారు భావించుచుండిరి.[10] యేసు ఏమి చేయుచుండెనో వారు ఎంత తక్కువగా గ్రహించారు కదా!

జనసమూహములో ఉంటూ ఆయనను హేళన చేయుచుండిన ఇతరులు యేసును సూటిగా అపహసించారు, అయితే యూదుల నాయకులు అలా చేయలేదు. వారు పలికిన మాటల గూర్చి పేర్కొనబడిన మూడు సందర్భములలోను, వారు ఆయన గూర్చి ఒకరితో నొకరు మాటలాడుకొనుచుండిరి - కానీ యేసుతో కాదు (27:41-43; మార్కు 15:31, 32; లూకా 23:35).

**వచనము 44. ఆయనతో కూడ సిలువవేయబడిన బందిపోటు దొంగలు** యేసును ఎగతాళి చేసినవారిలో మూడవ గుంపుకు చెందియున్నారు.[11] ఇద్దరు దొంగలలో నుండి ఒకని హృదయములో కలిగిన మార్పును మత్తయి వర్ణించకపోయినప్పటికిని, లూకా 23:40-43 వర్ణించుచున్నది. వాని మనస్సును మార్చివేసిన మతలబేమిటో మనకు తెలియజెప్పబడలేదు, కానీ వానిలో కలిగిన మార్పు మాత్రం నిజమైన మారుమనస్సు కలుగజేసినది. ఆయనను అవమానించుచుండినవారిని మరియు ఆయనను సిలువవేయుచుండినవారిని దేవుడు క్షమించవలసినదని యేసు చేసిన ప్రార్థనల చేత వాడు

ప్రగాఢంగా ప్రభావితుడై యుండును (లూకా 23:39).

మరణావస్థలో సహితము యేసు ప్రదర్శించిన ప్రవర్తన వానిని బహుగా ప్రభావితము చేసియుండును. హేతువేదైనా దానితో నిమిత్తము లేకుండా, మాంసపు గుండెకును రాతి గుండెకును మధ్య నుండు తేడాను అతడు ప్రదర్శించాడు. వాడు, "యేసూ, నీవు నీ రాజ్యము లోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుము!" అని పలికాడు (లూకా 23:42). అందుకు యేసు, "నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువు" అని బదులు పలికాడు (లూకా 23:43).

## యేసు సిలువవేయబడుచుండిన ప్రక్రియ ముగింపు మరియు తదనంతర సూచనలు (27:45–54)

**45మధ్యాహ్నము మొదలుకొని మూడు గంటలవరకు ఆ దేశమంతటను చీకటికమ్మెను.**
**46ఇంచుమించు మూడు గంటలప్పుడు యేసు–ఏలీ, ఏలీ, లామా సబక్తానీ అని బిగ్గరగా కేకవేసెను. ఆ మాటకు నా దేవా, నా దేవా, నన్నెందుకు చెయ్యి విడిచితివని అర్థము.**
**47అక్కడ నిలిచియున్నవారిలో కొందరా మాట విని–ఇతడు ఏలీయాను పిలుచుచున్నాడనిరి.**
**48వెంటనే వారిలో ఒకడు పరుగెత్తుకొని పోయి, స్పంజీ తీసికొని చిరకాలో ముంచి, రెల్లున తగిలించి ఆయనకు త్రాగనిచ్చెను; 49తక్కినవారు–ఊరకుండుడి ఏలీయా అతని రక్షింపవచ్చునేమో చూతమనిరి. 50యేసు మరల బిగ్గరగా కేకవేసి ప్రాణము విడిచెను.**
**51అప్పుడు దేవాలయపు తెర పైనుండి క్రింది వరకు రెండుగా చినిగెను; భూమి వణకెను; బండలు బద్ద లాయెను; 52సమాధులు తెరవబడెను; నిద్రించిన అనేకమంది పరిశుద్ధుల శరీరములు లేచెను. 53వారు సమాధులలోనుండి బయటికి వచ్చి ఆయన లేచినతరువాత పరిశుద్ధ పట్టణములో ప్రవేశించి అనేకులకు అగపడిరి. 54శతాధిపతియు అతనితోకూడ యేసునకు కావలియున్నవారును, భూకంపమును జరిగిన కార్యములన్నిటిని చూచి, మిక్కిలి భయపడి–నిజముగా ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి.**

**వచనము 45.** యేసుకు పిలాతు యెదుట తీర్చబడుచుండిన తీర్పు ఉదయం ఆరు గంటల సమయంలో మొదలయ్యింది, సుమారు ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో యేసు సిలువవేయబడినాడు (27:1, 35పై గల వ్యాఖ్యానము చూడు). **ఆరవ జాము మొదలుకొని తొమ్మిదవ జాము వరకు దేశమంతటను చీకటి కమ్మెను.** "ఆరవ జాము" మధ్యాహ్న సమయమును (మధ్యాహ్నము 12:00 గంటలు) సూచించును, మరియు "తొమ్మిదవ జాము" మధ్యాహ్నము మూడుగంటల సమయమును సూచించును. యేసు సిలువ మీద ఆరు గంటల పాటు వ్రేలాడియుండెను. మధ్యాహ్నము మొదలుకొని, మూడు గంటల వరకు, భూమియందంతట చీకటి కమ్ముకొన్నది. "సూర్యుడు అదృశ్యుడాయెను" గనుక అంధకారము అలుముకొన్నదని లూకా వ్రాయుచున్నాడు (లూకా 23:45). "అదృశ్యుడాయెను" అని అనువదింపబడిన గ్రీకు పదము (*ekleipō*), "లోపించుట" లేక "ఆరిపోవుట" అని అర్థమిచ్చుచున్నది. ఈ గ్రీకు పదము "eclipse" అను ఆంగ్ల పదమునకు సమీపముగా నున్నది. ఏది ఏమైనా, ఈ అంధకారము మామూలు సూర్యగ్రహణము వలన కలిగినది కాదు.

అది అలా అయియుండుటకు వీలు లేదు. ఏలయనగా అది పస్కా పండుగ సమయము మరియు నిండు పున్నమి రోజులు. సూర్యగ్రహణము సంభవించుటకు వీలు లేనంతగా సూర్యచంద్రులు చాలా ఎడముగా నుండినవి. ఈ సంఘటన అవశ్యముగా లోకాతీతమైనదై యుండును. యేసు మరణించిన సమయములో సంభవించిన దీని గూర్చి మరియు ఇతర సంఘటనల గూర్చి ప్రాచీన బైబిలేతర మూలాధారములు తెలియజెప్పుచున్నవి.[12] ప్రత్యేకించి, ఆది సంఘ రచయిత టెర్టుల్లియన్ ఇలా వ్యాఖ్యానించుచున్నాడు,

> ఆ సమయంలోనే, పగటి వెలుగు సహితము వెనక్కుతగ్గింది, అదే సమయంలో సూర్యుడు మధ్యాహ్న రేఖా జ్వాలతో వెలుగుచుండినది. క్రీస్తు గూర్చి ఈ విషయం ముందుగానే తెలియజెప్పబడినదని ఎరుగనివారు, నిస్సందేహంగా అదొక సూర్యగ్రహణమనుకొన్నారు. *ప్రపంచంలో సంభవింపనై యుండిన గమనార్హమైన అలౌకిక ఘటన గూర్చిన నివేదిక యింకా మీ ప్రాచీన గ్రంథాలలోనే ఉన్నది* (ఒత్తి పలికింది నాది).[13]

మత్తయి సువార్తీకుడు వివరించనప్పటికిని, ఆ నాటి అంధకారమునకు లాక్షణికమైన అర్థమున్నది. దేవుని పరిశుద్ధతకు ప్రతినిధి, వెలుగు; అలాగే చెడు, చీకటి చేత సూచింపబడుచున్నది (1 యోహాను 1:5) గనుక, యేసు సిలువపై వ్రేలాడుచుండిన సమయంలో దేశమంతయు మూడు గంటల పాటు చీకటి కమ్ముకొనినదను వాస్తవము ఆయన లోక పాపములను భరించుటతో అనివార్యముగా సంబంధము కలిగియుండును. లేఖనములలో పేర్కొనబడిన అంధకారము, శోకించుట మరియు తీర్పుతో సంబంధముగలదై యున్నది (యెషయా 5:30; 13:9–11; యోవేలు 3:14, 15; ఆమోసు 8:9). దాని దుర్మార్గతనుబట్టి మానవాళికి విధింపబడవలసి యుండిన శిక్ష సిలువలో యేసుపై మోపబడినది (యెషయా 53:5, 6, 10, 11; 2 కొరింథీయులకు 5:21; గలతీయులకు 3:13; 1 పేతురు 2:24; 3:18; 1 యోహాను 2:2; 4:10). యేసు మరణించిన దినము మానవ చరిత్రలోనే అత్యంత అంధకారమయమైన దినమై యుండినదంటే ఆశ్చర్యము యిసుమంతైనా కలుగదు!

**వచనము 46. తొమ్మిదవ జామున**, అనగా మధ్యాహ్నము మూడు గంటల సమయంలో, **యేసు ఏలీ, ఏలీ, లామా సబక్తానీ? అని కేకవేసెను.** సువార్త రచయిత మత్తయి యూదుల నుద్దేశించి రచించినప్పటికిని, వారందరికి హెబ్రీ (అరమెయిక్) భాషలో ఆశించినంతటి అనర్గళత ఉండియుండదు. కాబట్టి, యేసు పలికిన ఈ మాటను గ్రీకు భాషలోనికి అనువదించాడు, ఆ భాష సామాన్యమైనదై దాదాపుగా ప్రతి ఒక్కరికి పరిచితమైనదై యుండినది. **నా దేవా, నా దేవా, నన్నెందుకు చెయ్యి విడిచితివి?** అనునది వేదనతో కూడిన ఈ కేక యొక్క అర్థమై యున్నది. యేసు కీర్తనలు 22:1 నుండి ఉల్లేఖించుచుండెను. మెస్సీయా సంబంధమైన ఈ కీర్తనకు సంబంధించిన ఇతర రిఫరెన్సుల ఈ అధ్యాయంలో ఇదివరకే ఎత్తిచూపించబడినవి (27:39, 43పై గల వ్యాఖ్యానములను చూడు).

యేసు సిలువ మీద నుండి పలికిన మాటలలో ఈ ఒక్క కేక మాత్రమే మత్తయి మరియు మార్కు సువార్తల రచయితలు గ్రంథస్థం చేసినదై యున్నది. మత్తయి 27:46లో "నా దేవా" అని అర్థమిచ్చు హెబ్రీ పదము *ఏలీ* కలదు, 15:34లో ఇదే మాట యొక్క అరమెయిక్ అనువాదము, *ఎలోయీ* కలదు. మొత్తము ఏడు మాటలలో నుండి మిగిలిన

ఆరు మాటలు మూడేసి చొప్పున లూకా మరియు యోహాను సువార్తలలో ఆ గ్రంథములకే విశిష్టమైనవై యున్న కేకలు వ్రాయబడి యున్నవి (లూకా 23:34, 43, 46; యోహాను 19:26, 27, 28, 30).

మత్తయి మరియు మార్కు సువార్తలలో రచింపబడిన యేసు కేకను ఎలా అనువదించవలెను? తండ్రియైన దేవుడు వాస్తవముగా యేసును విడిచిపెట్టాడా? ఈ ఇరువురును ఒకే దైవాత్మ గలవారై యుండగా, తండ్రియైన దేవుడు కుమారుడైనవానిని విడిచిపెట్టి యుండునా? ఈ ప్రశ్న సంవత్సరాల తరబడి కొనసాగుచున్న చర్చనీయాంశమై యున్నది. ఆయనను దైవమానవునిగా చేసిన ద్వంద్వ స్వభావము యేసు కలిగియుండినందు వలన, దేవుడు మానవుడై యుండిన యేసు నుండి దూరమయ్యాడని కొందరు సూచించుచున్నారు. ఇది అసాధ్యమైన దృక్పథమై యున్నది. యేసు తన మానవీయమైన అనుభూతులను అభివ్యక్తము చేయుచుండెను కానీ వాస్తవముగా ఆయన విడిచిపెట్టబడలేదని ఇతరులు ప్రతిపాదించుచున్నారు. తండ్రియైన దేవుని చేత విడిచిపెట్టబడిన అనుభూతులను అభివ్యక్తము చేయుటకు ఆయన కీర్తనలు 22:1లోని మాటలను ఉల్లేఖించుచుండెను.

ఇటువంటి పరిస్థితి ఎలా సాధ్యమయ్యిందో వివరించుటకు కష్టమైనప్పటికిని, దేవుడు వాస్తవముగా యేసును విడిచిపెట్టి యుండును. నిత్యత్వమంతటిలోను మొదటిసారి మరియు ఒకే ఒక్క పర్యాయము పరలోకమందున్న తండ్రి నుండి ఏర్పడిన ఎడబాటు వలన ఆయనకు కలుగుచుండిన బాధను తెలియజెప్పుటకు యేసు తీవ్రమైన వేదనతో మాటలాడుచుండెను. దేవుని కుమారుడైనవాడు మానవాళి పాపమును తన మీద వేసికొనినప్పుడు, దేవుడు పెడముఖంపెట్టాడు. ఏదో ఒక విధంగాను కార్యసాధనలో తోడ్పడు ఏదో ఒక కారణంతోను, సిలువలో వ్రేలాడుచుండిన దైవమానవుడు దేవుని నుండి క్షణకాలము వేరుచేయబడినాడు. ఈ సమయంలో "ఆగ్రహముతో కూడిన తండ్రి ఉగ్రత పాపరహితుడైన కుమారునిపై కుమ్మరింపబడినది, ఈ కుమారుడు అసమానమైన కృపనుబట్టి ఆయన యందు విశ్వాసముంచువారి నిమిత్తము పాపమయ్యాడు."[14]

యేసు కేకలో, కోల్పోవడము వలన కలుగు కొరత ప్రదర్శింపబడినప్పటికిని, అది నమ్మకము మరియు నిరీక్షణతో కూడినదై యుండెను. ఇవ్విధంగా విడిచిపెట్టబడిన అనుభూతి ఏర్పడిన తరువాత యేసు, "నా దేవా!" అని కేక వేసాడు. చివరకు ఆయనను ఎట్టి అపాయకరమైన పరిస్థితులలో నుండి యైనను కాపాడి సంరక్షించువానిలో నమ్మకముంచుటకు యేసు ఎన్నడును మానలేదు. కీర్తనలు 22లోని మాటలు యేసు సిలువ మీద నుండి పలికిన మాటలలో ఉపయోగించుకొన్నాడు, మరియు దేవుని విముక్తిని వేడుక చేసుకొనుచుండు ఒక విజయోత్సవ నాదముతో ముగియుచున్నదని గ్రహించుట ముఖ్యమై యున్నది. వాస్తవమునకు, కీర్తనలు 22:22, హెబ్రీయులకు 2:11, 12లో యేసు పలికిన మాటలలో ఒకటిగా ఉల్లేఖింపబడి యున్నది: "నీ నామమును నా సహోదరులకు ప్రచురపరతును, సమాజము మధ్య నీ కీర్తిని గానము చేతును."

**వచనము 47.** యేసు సిలువలో వ్రేలాడుచుండగా, శ్వాస తీసికొనుటకు సహితము ప్రయాసపడుచుండగా, ఆయన పలికిన పలుకులను గ్రహించుట కష్టంగా ఉండియుండును. జే. డబ్ల్యు. మెక్‌గార్వే యేసు గూర్చి ఇలా చెప్పుచున్నాడు:

> ఇప్పటికి ఆయన దాదాపుగా గడిచిన ఆరు గంటల నుండి సిలువ మీద వ్రేలాడుచున్నాడు, గనుక ఆయన అనుభవించుచుండిన తీవ్రమైన శ్రమ మరియు స్రవించిన రక్తము చేత ఏర్పడిన తీవ్రోష్ణతతో కూడిన దాహము, దీనితో పాటు బాగా విప్పారిన చేతులతో సిలువపై వ్రేలాడుచుండిన దాని ఫలితంగా, ఆయన రొమ్ము కండరములపై కలిగిన గొప్ప ఒత్తిడి, ఇవన్నీ ఒకదానికి మరొకటి తోడై, ఆయన నోట నుండి వెలువడుచుండిన ఉచ్ఛారణ కష్టమైనదిగాను, అస్పష్టమైనదిగాను ఉండియుండును.[15]

"నా దేవా!" (*ఏలీ*) అని యేసు కేకవేసినప్పుడు, **అచ్చట నిలిచియున్నవారిలో కొందరు** ఆయన మాటలను తప్పుగా అర్థంచేసుకొన్నారు. **ఇతడు ఏలీయాను పిలుచుచున్నాడని** వారన్నారు. ప్రవక్తయైన ఏలీయ మరణమును చూడలేదు (2 రాజులు 2:11, 12) మరియు "ఏలీయా" వచ్చునని ప్రవచన రీతిగా పలుకబడినది (మలాకీ 4:5) గనుక, ఏలీయా ఇహమునకు తిరిగి వచ్చునని యూదులు ఎంతో ఆశతో ఎదురుచూచుచుండిరి (11:14; 16:14; 17:3పై గల వ్యాఖ్యానములను చూడు). అణగద్రొక్కబడుచుండిన నీతిమంతులకు ఏలీయా సహాయము చేయునని వారు నమ్మారు. యేసు మాటలను తప్పుగా అర్థంచేసుకొన్నవారు ఏలీయా వచ్చి ఆయనను మరణము నుండి విడిపించవలెననియు, ఆయన యందు విశ్వసించినందువలన అణగద్రొక్కబడుచుండినవారికి న్యాయము చేయవలెననియు యేసు ఏలీయాను పిలుచుచుండెనని అనుకొన్నారు.

**వచనము 48.** ఆ దారిన వెళ్లుచుండిన దానయ్య ఎవరో లేదా ఒక సైనికుడు ఆయనకు త్రాగుటకేదైనను తెచ్చి ఇవ్వవలెనని పరుగెత్తుకొని వెళ్లాడు. ఇలా పరుగెత్తినవాడు, ఒక వేళ ఏలీయా తిరిగి రానట్లయితే, వాడు సరైన స్థానంలో ఉండవలెనని ఆశించాడని ప్రతిపాదింపబడినది. వాడు **ఒక స్పంజీ తీసికొని, దానిని చిరకాలో** (*oxos*) **ముంచి, రెల్లున తగిలించి** ప్రభువు నోటికి దగ్గరగా ఉంచాడు. "దప్పిగొనుచున్నాను" అని యేసు పలికిన తరువాతనే (యోహాను 19:28) ఈ పని చేయబడినదని నిస్సందేహముగా చెప్పుకొనవచ్చును. ఒక పర్యాయము చేదు కలుపబడిన ద్రాక్షా రసమును (*oinos*) ఆయన కిచ్చినప్పుడు ఆయన దానిని నిరాకరించాడు (27:34), అయితే ఇప్పుడు ఈ చిరకను పుచ్చుకొన్నాడు (యోహాను 19:30). ఈ సంఘటన కీర్తనలు 69:21లో గల ప్రవచన వాక్కులను ప్రతిధ్వనించినది: "... నాకు దప్పికయైనప్పుడు చిరకను త్రాగనిచ్చిరి."

యేసు నోటికి అందించబడిన ద్రావకము చౌక ధర గలదియు, నీళ్లు కలుపబడిన ద్రాక్షారసమై యుండును, ఇవ్విధమైన పానీయమును రోమా సైనికులు వినియోగించుచుండిరి (లూకా 23:36 చూడు). ఆ ద్రాక్షారసము నీళ్లు కలుపబడినదైనందు వలన, యేసు దాహమును తీర్చుట మాత్రమే కాదు కానీ ఆయన మాటలను అచ్చోట నిలువబడి వినుచుండినవారు గ్రహించగలుగునట్లు ఆయన స్పష్టముగా మాటలాడగలుగుటకు ఆరిపోయి యుండిన ఆయన పెదవులను తడుపుటకును అది తోడ్పడినది.

**వచనము 49.** స్పష్టముగా, యేసు ఏలీయాను పిలుచుచుండెనని భావించిన **తక్కినవారు** తగు జాగ్రత్త వహించారు. **ఊరకుండుడి ఏలీయా అతని రక్షింపవచ్చునేమో చూతమని** వారన్నారు. బహుశా, ప్రవక్తయైన ఏలీయా నిజముగానే తిరిగి వచ్చునని వారు విశ్వసించి యుందురు, లేదా వారు మరొక పర్యాయము కేవలము యేసును ఎగతాళి చేసియుందురు.

**వచనము 50.** వెనువెంటనే, **యేసు మరలా గొప్ప శబ్దముతో కేకవేసి,** "తండ్రీ, నీ చేతికి

నా ఆత్మను అప్పగించుకొనుచున్నానని" పలికెను (లూకా 23:46). "అప్పగించుకొనుట" (KJV) అనగా, "వశము చేసికొనుట లేక లొంగిపోవుట" అని అర్థము. ఇచ్చట "గొప్ప శబ్దముతో" కేక వేసెనని వ్రాయబడి యున్న మాటలు, "సమాప్తమైనది!" అని ఆయన పలికిన మాటలను సూచింపవచ్చును (యోహాను 19:30). విజయోత్సవ సంకేతముగా వేయబడిన ఈ కేక తదుపరి, ఆయన "తన తల వంచి" **ఆత్మను అప్పగించెను** (యోహాను 19:30). చేయవలెనని ఆయన చేతులకు అప్పగింపబడి ఆయన పంపబడిన కార్యము సమాప్తమయ్యింది. ఆయన ప్రాణమును ఎవడును తీసికొనడనియు, ఆయన తనంతట తానే తన ప్రాణము పెట్టుననియు, తిరిగి తీసికొనుననియు యేసు సెలవిచ్చాడు (యోహాను 10:15–17). మరణమునకు తన ఆత్మను అప్పగించుకొనుట ద్వారాను, మూడు దినముల తరువాత తిరిగి లేచుట ద్వారాను ఆయన తన వాగ్దానమును నిలబెట్టుకొన్నాడు.

**వచనము 51.** మధ్యాహ్నము పన్నెండు గంటలు మొదలుకొని మూడు గంటల వరకు అంతటను చీకటి అలుముకొన్నది (27:45). యేసు సిలువపై మరణమొందినప్పుడు అంధకారము అలుముకొనిన దృగ్విషయముతో పాటు, అద్భుతకరమైన ఇతర సంఘటనలు సహితము సంభవించినవి. పరిశుద్ధ స్థలమును అతిపరిశుద్ధ స్థలము నుండి వేరుచేయుచుండిన **దేవాలయపు తెర** (నిర్గమకాండము 26:31–33; హెబ్రీయులకు 9:3 చూడు) **పైనుండి క్రింది వరకు రెండుగా చినిగెను.** మిశ్నా ప్రకారము, సువిశాలమైన ఈ తెర "డెబ్బది రెండు నూలు పోగులు కలిగి, ఒక్కొక్క పోగులో ఇరువది నాలుగు దారములు గల మగ్గముపై నేయబడినది. అది నలుబది మూరల [అరువది అడుగులు] పొడవు, ఇరువది మూరల [ముప్పది అడుగులు] వెడల్పు ఉండినది."[16] "అది బబులోను దేశ తెరయై యుండినది, నీలి, మరియు సింధూర, మరియు ఊదా రంగు గల, అతి సన్నని నారబట్టతో నిజముగా అద్భుతకరముగా నుండిన నేత తీరు కలిగియున్న బుటేదారి అలంకార అల్లికగా అల్లబడినదని" దీనిని జోసీఫస్ వర్ణించాడు.[17]

విషయము మత్తయి సువార్తలో వివరముగా వివరింపబడనప్పటికిని, దేవాలయ తెర చినుగుట గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకొన్నది. అది లేవీ గోత్రమునకు చెందిన యాజకత్వము మరియు బల్యర్పణల పద్ధతి కలిగియుండిన పాత నిబంధన ముగింపును సూచించినది. యేసు పలికిన ప్రవచనము ప్రకారము (24:1, 2), క్రీ.శ. 70లో యెరూషలేము దేవాలయము నాశనము చేయబడింది, జంతువులను బల్యర్పణ గావించు విధానమును అంతమొందించింది. యేసు మరణించినప్పుడు చినిగిపోయిన దేవాలయపు తెర, ఆయన బలియాగము ప్రజలు దేవుని సమీపించుటకు నూతనమైనది మరియు సంపూర్ణమునైన మార్గమును సరాళము చేయుచున్నదని సూచించుచున్నది. హెబ్రీ పత్రిక రచయిత, యేసు మన గొప్ప ప్రధాన యాజకుడై యున్నాడని చెప్పుచూ, దేవాలయపు తెర గూర్చిన మనఃకల్పనను ఇలా వర్ణిస్తున్నాడు:

> ఈ నిరీక్షణ నిశ్చలమును, స్థిరమునై, మన ఆత్మకు లంగరువలెనుండి *తెరలోపల* ప్రవేశించుచున్నది. నిరంతరము మెల్కీసెదెకు క్రమము చొప్పున ప్రధానయాజకుడైన యేసు అందులోనికి మనకంటె ముందుగా మన పక్షమున ప్రవేశించెను (హెబ్రీయులకు 6:19, 20).

"... నూతనమైనదియు, జీవముగలదియు, ఆయన శరీరము అను *తెర ద్వారా* యేర్పరచబడినదియునైన మార్గమున, ఆయన రక్తము వలన పరిశుద్ధ స్థలమునందు ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నదని" కూడ హెబ్రీ పత్రిక రచయిత రచించాడు (హెబ్రీయులకు 10:19, 20).

దేవాలయపు తెర చినుగుటను, "వేదాంతశాస్త్ర సంబంధముగా అదొక ప్రాముఖ్యతగల సంఘటన యని" పిలుచుచు, "యేసు మరణము ద్వారా, ... దేవుడే మన కొరకు తెరువబడినాడు గనుక ఆయనను సమీపించు మార్గము బాహాటముగా సరాళము చేయబడినదని" కూడ ఎఫ్. ఎఫ్. బ్రూస్ చెప్పుచున్నాడు.[18] యేసు బలియాగము పాత నిబంధన అడ్డంకులను తొలగించినది; అది బల్యర్పణలు మరియు సంబంధిత శాసనముల యుగమును అంతము చేసి దేవుని సముఖము లోనికి స్వేచ్ఛగా ప్రవేశించుటకు మార్గమును సరాళము చేసినది (కొలొస్సయులకు 2:13-15; హెబ్రీయులకు 8:13 చూడు).

యేసు సిలువపై మరణించినప్పుడు సంభవించిన మరొక అద్భుతము, **బండలను బద్దలు చేసిన** భూకంపము. ఈ అద్భుతమును మత్తయి సువార్త మాత్రమే పేర్కొనుచున్నది. దేవాలయపు తెర చినుగుటను ఈ భూకంపమే హేతువని కొందరు భావించుచున్నారు, కానీ మూల గ్రంథ పాఠము ఈ విషయమును నిర్దిష్టముగా తెలియజెప్పుట లేదు.

**వచనములు 52, 53. సమాధులు** తెరవబడుట కూడ భూకంపము వలన కలిగిన సూటియైన పరిణామమై యుండవచ్చును. ఏది ఏమైనా, మృతులు పునరుత్థానులగుట మరొక భిన్నమైన అద్భుతమై యున్నది. **నిద్రించిన అనేక మంది పరిశుద్ధుల శరీరములు లేచెను**, అట్లయినను పునరుత్థానులైనవారు యేసు తానే పునరుత్థానుడైనంత వరకు యెరూషలేము **పట్టణములో** దర్శనమీయలేదు. వీరు కొంత కాలము మేరకే మరణించి యుండిరనియు ఇతరులకు తెలిసియుండినవారై యుండిరనియు మనము భావించవచ్చును; లేదంటే, వారి పునరుత్థానము గూర్చిన ప్రాముఖ్యత వారిని చూచినవారితోనే కోల్పోబడును. వారు, లాజరు వలెనే (యోహాను 11:43, 44; 12:2), వారి పూర్వ జీవితమును పునఃప్రారంభించి యుందురు.

అంధకారము యేసును పాపము భరించుచున్నవానిగా సూచించుచున్నది (27:45) మరియు దేవాలయపు తెర చినుగుట దేవుని సమీపించుటకు ఏర్పాటైన ఒక నూతన మార్గమును సూచించుచున్నది (27:51), ఇది ఇలా వుండగా ఈ పరిశుద్ధుల పునరుత్థానము, విశ్వసనీయమైన సమస్త విశ్వాసుల నిత్యజీవముకైన పునరుత్థానమునకు ముందుఛాయయై యుంటున్నది. భవిష్యత్ పునరుత్థానము క్రీస్తు యొక్క మరణ పునరుత్థానముల చేత సాధ్యము గావింపబడినది.

**వచనము 54. భూకంపమును జరిగిన కార్యములన్నిటిని చూచి,** యేసు మరణించిన తీరు చేత సహితము (మార్కు 15:39) - యేసు సిలువవేయబడవలసిన ప్రక్రియ నంతటిని బాధ్యతాయుతంగా పర్యవేక్షించుచుండిన **శతాధిపతి** బహుగా ప్రభావితుడయ్యాడు. ఇవన్నీ శతాధిపతిలో కూడ **యేసునకు కావలియున్న** ఇతర సైనికులను సహితము ప్రభావితులను గావించినవి. కఠిన హృదయులైన వీరు, బహుశా సిలువ మరణములను వందల లెక్కలో చూచియుండినవీరు, **మిక్కిలి భయపడి -నిజముగా ఈయన దేవుని కుమారుడని! అని చెప్పుకొనిరి** (14:33; 16:16పై గల వ్యాఖ్యానములను చూడు). మార్కు వ్రాసిన సువార్తలో,

ఈ ఘోషణ కేవలము శతాధిపతికే ఆరోపింపబడుచున్నది (మార్కు 15:39). సైనికుల సముచ్ఛయమంతా యేసు దైవత్వములో వారుంచిన తమ విశ్వాసమును ప్రకటించుకొనునట్లు ఈ శతాధిపతి నాయకత్వము వహించియుండును.

## దూరము నుండి గమనించుచుండిన స్త్రీలు (27:55, 56)

**[55]యేసునకు ఉపచారము చేయుచు గలిలయ నుండి ఆయనను వెంబడించిన అనేకమంది స్త్రీలు అక్కడ దూరమునుండి చూచుచుండిరి. [56]వారిలో మగ్దలేనే మరియయు యాకోబు యోసే అనువారి తల్లియైన మరియయు, జెబెదయి కుమారుల తల్లియు ఉండిరి.**

**వచనము 55.** శుక్రవారము నాడు యేసు కలువరి గిరిపై సిలువవేయబడుచుండగా **అనేక మంది స్త్రీలు** గమనించుచుండిరి (మార్కు 15:40, 41; లూకా 23:49; యోహాను 19:25–27). వారు **యేసునకు ఉపచారము చేయుచు గలిలయ నుండి ఆయనను వెంబడించుచుండిరి.** "ఉపచారము చేయుట" అని అనువదింపబడిన గ్రీకు పదము (*diakoneō*) "సమకూర్చుట" అనియు (NRSV చూడు) లేక "శ్రద్ధ వహించుట" అనియు అర్థమిచ్చును (NLT) వారికి అందుబాటులో నుండిన ఆర్థిక వనరుల నుండి వారు యేసునకు సహాయము చేసియుందురనునది ఒక అభిప్రాయమై యున్నది (లూకా 8:1–3) లేక వారు ఆయనకు భోజనము సిద్ధపరచి యుందురు (లూకా 10:40). బహుశా, వారు ఈ రెండు పనులు చేసియుందురు.

గెత్సేమనే తోటలో నుండి పారిపోయిన శిష్యుల వలె గాక (26:56), సాహసవంతులైన ఈ స్త్రీలు యేసు యెడల విశ్వసనీయమైన ప్రభుభక్తిగలవారై యుండిరి. ప్రేమ చేత ప్రేరేపింపబడినవారై, చివరి క్షణము వరకు కూడ యేసునకు సమీపముగా ఉండుటకు వారి వ్యక్తిగత అభిమానమును మరియు భద్రతను నష్టపోవుటకైనను వారు ఇష్టపడుచుండిరి. వారు **దూరము నుండి** చూచుచుండిరి, అంతమాత్రాన ఈ వాస్తవము వారి భయముగా భావింపబడకూడదు. ఎవరును – ముఖ్యముగా ఆయన యెడల సహానుభూతిని ప్రదర్శించుచుండినవారు–యేసు సిలువను అతి సమీపంగా సమీపించకుండునట్లు రోమీయులు ఆ సిలువ చుట్టూర హద్దును ఏర్పాటు చేసియుందురు. వేదింపబడుచుండిన తన కళ్లను చిరాకు కలిగించుచుండిన సిలువ సమీపములోని దృశ్యముల నుండి విశ్వసనీయులై యుండి ఆయన మరణము గూర్చి విలపించుచుండిన ఈ స్త్రీల దిశగా త్రిప్పుట, అది ఆయనకు ఎంతో గొప్ప ఆదరణనిచ్చుచుండినదంటే ఆశ్చర్యమేమున్నది!

**వచనము 56.** మత్తయి వ్రాసిన సువార్తలో పేర్కొనబడిన స్త్రీల జాబితా ఆశ్చర్యజనకమై యున్నది. మొదట **మగ్దలేనే మరియ** పేర్కొనబడినది, ఆమె మగ్దల ప్రదేశమునకు చెందినదని ఆమె పేరు చెప్పుచున్నది (15:39పై గల వ్యాఖ్యానము చూడు). లూకా 8:2 ప్రకారము, ఆమెలో నుండి యేసు ఏడు దయ్యములను వెళ్లగొట్టాడు. ఆమె జీవితములో యేసు చేసిన ఉపకారమునకు కృతజ్ఞతగా ఆమె తన అంకితభావమును ఆయన యెడల అభివ్యక్తము చేయుచుండెను (27:61; 28:1పై గల వ్యాఖ్యానములు చూడు).

మరొక **మరియ** కూడ పేర్కొనబడినది; ఆమె **యాకోబు మరియు యోసే అనువారి తల్లి.** ఆమె "చిన్న యాకోబు యోసే అను వారి తల్లి" అని మార్కు 15:40 చెప్పుచున్నది.

ఆమె యోహాను 19:25లో పేర్కొనబడినట్లు క్లోపా భార్యయై యుండును.

**జెబెదయి కుమారుల తల్లి,** అనగా, యాకోబు మరియు యోహానుల తల్లి (4:21, 22పై గల వ్యాఖ్యానము చూడు) పేర్కొనబడిన తరువాతి స్త్రీయై యున్నది. మార్కు వ్రాసిన సువార్తలో, ఆమె సలోమే అని గుర్తింపబడినది (మార్కు 15:40; 16:1). యేసు తన రాజ్యములో తన ఇద్దరు కుమారులకు గౌరవనీయమైన స్థానములు కల్పించవలెనని కోరుచు, వారి పక్షముగా యేసు యొద్దకు వచ్చిన స్త్రీ ఈమెయే (20:20–23).

లూకా 23:49 ప్రకారము, "ఆయనకు నెళవైనవారందరు" "దూరముగా నిలుచుండి, ఈ సంగతులన్నిటిని చూచుచుండిరి." యేసు తల్లి, మరియ "సిలువ యొద్ద" తాను ప్రేమించిన శిష్యునితో కూడ నిలువబడి యుండినదని యోహాను 19:26, 27 సూచించుచున్నది.

యేసు మరణిస్తాడని – మరి ముఖ్యముగా యిటువంటి ఘోరమైన, క్రూరమైన రీతిగా మరణించునని – ఆయనను వెంబడించుచుండినవారు ఎన్నడు అనుకొనలేదు గనుక వారు అపనమ్మకముతోను విస్మయముతోను నిలువబడి యుండిరి. అంతా అయిపోయింది అన్నట్లుగా యేసు మరణించాడను సందేహము తీరిపోయిన తరువాత, వారిలో అనేకులు, ఒక ప్రక్కగా నిలువబడి యుండిన కొందరు స్త్రీలతో సహా (27:61; లూకా 23:55), యేసు మరణించుటతోపాటే వారి నిరీక్షణ కూడ మరణించిందని అనుకొంటూ, నిరుత్సాహము మరియు ఆశాభంగం కలిగిన అధైర్యముతో తూలిపోయారు.

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### యేసు ఇష్టపూర్వకంగానే సిలువను ఎదుర్కొన్నాడు (27:33–50)

మనము సిలువ గూర్చి ఎంత ఎక్కువగా నేర్చుకొంటామో, ఆయన మన కొరకు చేసిన బలియాగమునుబట్టి మన రక్షకుని మనము అంత ఎక్కువగా ప్రేమిస్తాము మరియు ఆయన యెడల వల్లమాలిన అభిమానం ప్రదర్శిస్తాము. మనము సిలువ గూర్చి అధ్యయనము చేయునప్పుడు, యేసు సిలువమరణము నొందుట ఒక పొరపాటు లేదా ఒక ప్రమాదవశాత్తు సంభవించిన సంభవము కాదను లోతైన ఒప్పింపుగలవారమై యుండవలెను. దేవుని నిత్య సంకల్పములో సిలువ ఒక భాగమై యుండినది. యెరూషలేము సమీపమున నుండిన కలువరి గిరిపై ఒక సిలువ నాటబడక ముందే ఏ నాడో దేవుని మనస్సులో ఒక సిలువ ఉండినది (ఎఫెస్సీయులకు 1:3, 4; 2 తిమోతి 1:9; 1 పేతురు 1:19, 20 చూడు).

దేవుడు మానవులమైన మన యెడల తన నిరపేక్షమైన న్యాయమును, అదే సమయంలో ఆయన ప్రేమను ప్రదర్శించుటకు ఇంత కంటె ఉత్తమమైన మార్గము మరొకటుండునా (రోమీయులకు 3:24–26)? యేసు తన తండ్రి చిత్తమును నెరవేర్చుటకు ఈ లోకమునకు వచ్చినందు వలన, ఆయన సిలువను ఒక అగత్యమైన అవసరముగా పరిగణించాడు (16:21–23). ఆయన సిలువను స్వచ్ఛందంగా అంగీకరించాడు ఏలయనగా ఆయన తనను తాను దేవుని సేవకునిగా ఎంచుకొన్నాడు.

### యేసును సిలువ మీద నిలిపి ఉంచినదేమిటి? (27:40)

రోమా సైనికులు యేసు హస్తముల లోనికి మేకులు దిగగొట్టి ఆయనను సిలువ మీద

ప్రేలాడదీసారు (యోహాను 20:25 చూడు), కానీ "నీవు దేవుని కుమారుడవైతే, సిలువ మీద నుండి దిగమంటూ" ఇతరులు హేళన చేయుచు పలికినప్పుడు (27:40) ఆయనను సిలువ మీదనే నిలిపియుంచిన దేమిటి? ఆయనను సిలువ మీదనే నిలిపి యుంచినవి ఆ మేకులు కావు (26:53; యోహాను 10:17, 18), కానీ తండ్రి చిత్తమే (26:39). ఆయన మరణించు వరకు యేసు సిలువ మీదనే నిలిచియున్నాడు ఏలయనగా అది దేవుని నిత్య సంకల్పమై యుండినది (ఫిలిప్పీయులకు 2:5–11). ఆయన "తన యెదుట ఉంచబడిన ఆనందము కొరకై" సిలువను సహించాడు (హెబ్రీయులకు 12:2). మన కొరకు ఆయన చూపిన ఇంత గొప్ప ప్రేమకు ప్రతిస్పందనగా, మన ఆధ్యాత్మిక అభివృద్ధి మార్గము మధ్యలో సాతాను ఎన్ని అడ్డంకులు అమర్చినా, మనము దేవుడు మరియు క్రీస్తు యెడల కలిగియుండవలసిన మన ప్రేమను పెంచి, మనము దేవుని రాజ్యములో విశ్వసనీయులమై నిలిచియుండునట్లు చేయవలెను.

## యేసు సిలువ మీద నుండి పలికిన ఏడు మాటలు (27:46)

యేసు సిలువ మీద నుండి పలికిన మాటలలో మత్తయి ఒక్క మాటను మాత్రమే రచించాడు. ఏది ఏమైనా, సువార్తలలోని అన్ని వివరాలు పరిశీలించినప్పుడు, అవి ఏడు మాటలని మనము తెలిసికొందుము:

1. "తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు; గనుక వీరిని క్షమించుము" (లూకా 23:34).
2. "నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువని, నిశ్చయముగా నీతో చెప్పుచున్నాను" (లూకా 23:43).
3. " 'అమ్మా, యిదిగో నీ కుమారుడు!' … 'యిదిగో నీ తల్లి' " (యోహాను 19:26, 27).
4. "నా దేవా, నా దేవా, నన్నెందుకు చెయ్యి విడిచితివి?" (మత్తయి 27:46; మార్కు 15:34).
5. "దప్పిగొనుచున్నాను" (యోహాను 19:28).
6. "సమాప్తమైనది!" (యోహాను 19:30).
7. "తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాను" (లూకా 23:46).

డేవిడ్ స్టూవర్ట్

## "పరదైసు" అనగానేమి? (27:50)

యేసు ఆత్మ శుక్రవారం రాత్రి మొదలుకొని ఆదివారం ఉదయం వరకు ఈ మూడు రోజులు ఎక్కడో ఒక చోట ఉండినది. ఆ చోటు ఏది? ఆయన తన ఆత్మను తన తండ్రి చేతులకు అప్పగించుకొన్నప్పటికిని (లూకా 23:46), ఆ సమయంలో ఆయన పరలోకమునకు తిరిగి వెళ్లలేదు (యోహాను 20:17). "నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువు" అని ఆయన పశ్చాత్తాపపడిన దొంగతో చెప్పాడు (లూకా 23:43). "పరదైసు" అని అనువదింపబడిన గ్రీకు పదము (*paradeisos*) "అందమైన తోట లేక పచ్చికగల

మైదానమని” అర్థమిచ్చుచున్నది, కానీ పరదైసు ఎక్కడున్నది? నిశ్చయముగా యేసు సమాధి గూర్చి మాటలాడలేదు; ఏలయనగా చీకటిమయమును, తేమగలదియునైన సమాధి ఒక పరదైశైయుండనేరదు.

క్రొత్త నిబంధన శారీరక జీవమునకును, మానవుల ఆత్మల నిత్య దైవవిధికిని మధ్య గల మధ్యంతర స్థితిని బయలుపర్చుచున్నది. ఈ స్థలము పేరు “ప్రేత లోకము” లేక “పాతాళము.” అది కంటికి కనబడని మృతులైనవారుండు స్థలము, శరీరం నుంచి వేరు చేయబడిన ఆత్మలుండు చోటు. ఆత్మ ఉండు ఈ తాత్కాలిక నివాసమును యేసు ధనవంతుడు మరియు లాజరు ఉపమానములో వర్ణించాడు (లూకా 16:19-31).

నీతిమంతులు మరియు అనీతిమంతులు కూడ ఈ పాతాళమునకు వెళ్లుదురు, కానీ ఒకే చోటుకు కాదు. యేసు చెప్పిన ఉపమానములో, బిచ్చగాడైన లాజరు అబ్రహాము రొమ్మున ఆనుకొని ఆనందించుచుండెను, అయితే ధనవంతుడు “వేదనపడుచుండెను” (లూకా 16:22, 23). ఈ రెండు స్థలములు పెద్ద అగాధము చేత వేరుచేయబడినవి (లూకా 16:26). యేసు మరణించినప్పుడు, ఆయన పరదైశుకు వెళ్లాడు (లూకా 23:43). అలాగైతే, పాతాళ లోకము, రెండు భాగములు గలదై యున్నది, ఒకటి వేధింపబడుటకు మరొకటి ఆదరింపబడుటకు. పునరుత్థాన దినమందు, పాతాళ లోకము మృతులను వదిలిపెట్టును (ప్రకటన 20:13). వేదన భాగములో నున్నవారు నరకములోనికి పడవేయబడుదురు, అయితే పరదైసులో ఉన్నవారు పరలోకమునకు వెళ్లుదురు.

---

సూచనలు

[1]నిటారుగా నుండిన దూలము తరుచుగా సిలువవేయబడిన చోట భూమిలో పాతబడి వదిలిపెట్టబడినది. సిలువవేయబడవలసిన చోటు చేరినప్పుడు, నేరస్థుని చేతులు అడ్డ దూలమునకు త్రాడుతో కట్టబడినవి లేదా మేకులతో దిగగొట్టబడినవి. ఆ తరువాత ఈ దూలము నిటారు దూలమునకు జోడించబడినది, అప్పుడు నేరస్థుని కాళ్లు నిటారు దూలమునకు త్రాడుతో కట్టబడినవి లేదా మేకులతో దిగగొట్టబడినవి. [2]Plutarch *Moralia* 554B. [3]Josephus *Against Apion* 2.4. [4]Michael J. Wilkins, “Matthew,” in *Zondervan lllustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Matthew, Mark, Luke*, ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 178; David F. Payne, “Golgotha,” in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 2:523-24. [5]Talmud *Sanhedrin* 43a; సామెతలు 31:6 చూడు. [6]Jack P. Lewis, *The Gospel According to Matthew*, Part 2, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 162; Metzger, 57-58, 153. [7]Leon Morris, *The Gospel according to Matthew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 717. [8]G. Bertram, *“paízō,”* in *Theological Dictionary of the New Testament*, ed. Gerhard Kittel and Gerhard Friedrich, abr. and trans. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 758. [9]కీర్తనలు 22లో దీనికి ముందటి వచనము తలులూచుటను పేర్కొనుచున్నది (27:39పై గల వ్యాఖ్యానము చూడు). [10]Wisdom of Solomon 2:17-20 చూడు.

[11]లూకా సువార్తీకుడు నాలుగవ గుంపును పేర్కొన్నాడు, ఆ గుంపులో సైనికులున్నారు (లూకా 23:36, 37). [12]సువార్తలలో నున్న వివరములను ఉదాహరణంగా పేర్కొంటూ, యేసు సిలువవేయబడినప్పుడు దేశమంతట అలుముకొన్న అంధకారమునకు గల చారిత్రాత్మకతను ఓరిగెన్ నొక్కివక్కాణించాడు. (Origen *Against Celsus* 2.33.) ఈ సాంప్రదాయము, పొంతి పిలాతు చేత రాయబడినదని చెప్పుకొనబడు అబద్ధ లేఖలో భద్రపరచబడినది. (*Letter of Pilate to Tiberius*.) [13]Tertullian *Apology* 1.21. [14]John MacArthur, Jr, *The MacArthur New Testament*

*Commentary: Matthew 24-28* (Chicago: Moody Press, 1989), 270. [15]J. W. McGarvey, *The New Testament Commentary,* vol. 1, *Matthew and Mark* (N.p., 1875; reprint, Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.), 246. [16]Mishnah *Shekalim* 8.5. [17]Josephus *Wars* 5.5.4. [18]F. F. Bruce, *The Epistle to the Hebrews*, New International Commentary on the New Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1964), 246.